సాక్షి తిరుపతి

గురువారం । 23 । జనవరి । 2025




వీరుడా.. నీ త్యాగం చిరస్మరణీయం

ఉగ్రదాడిలో కన్నుమూసిన వీర జవాన్ కార్తీక్ అంత్యక్రియలు బుధవారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. - 8లో



టీటీడీకి విరాళంగా 'కియోస్క్'

గోవిందరాజస్వామి ఆలయానికి ఎస్‌బీఐ తరఫున డిజిటల్ విరాళాల నిమిత్తం కియోస్క్ యంత్రం అందించారు. - 8లో



ఫిబ్రవరి 21 నుంచి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తీశ్వరుని ఆలయంలో ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

'సుకన్యా సమృద్ధి' మేళా రేపు



నరసప్ప, పోస్టల్ సూపరింటెండెంట్

తిరుపతి సిటీ : డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 24వ తేదీన సుకన్యా సమృద్ధి యోజన మేళా నిర్వహించనున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ బి.నరసప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జాతీయ బాలికాదినోత్సవాన్ని పురస్కరించుకుని సుకన్యా పథకం కింద ఖాతాలు తెరిచేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేళాలో 5వేల ఖాతాలు ప్రారంభించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. 10 ఏళ్లలోపు బాలికలు సుకన్య పథకం కింద ఖాతా తెరిస్తే, 18 ఏళ్లు నిండిన తర్వాత ఉన్నత విద్య కోసం ఉన్న మొత్తంలో 50శాతం నగదు తీసుకోవచ్చని వివరించారు. వివాహానికి నెల ముందుగానీ, వివాహనంతరం మూడు నెలలోపు పథకంలోని మొత్తం నగదును ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. ఈ ఖాతా కింద ఒక ఆర్థిక సంవత్సరానికి రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.1.50లక్షల వరకు చెల్లించవచ్చని వెల్లడించారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీసులో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 60,581 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 19,228 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.04 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 7 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

పరిశోధనలతో అద్భుత ఫలితాలు



ప్రొఫెసర్ సుందర రాజన్‌ను సత్కరిస్తున్న ఎంబీయూ నిర్వాహకులు

చంద్రగిరి : పరిశోధనలను మహాయజ్ఞంలా భావించి చేపడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని సింగపూర్ నవ్యాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ సుందరరాజన్ తెలిపారు. మోహన్‌బాబు యూనివర్సిటీలో 2024–25 ఐదో బ్యాచ్ పరిశోధక విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ, పబ్లికేషన్ ఎథిక్స్ అనే అంశాలపై మూడురోజుల వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సుందరరాజన్‌తోపాటు మైసూర్ జేఎస్ఎస్ సైన్స్, టెక్నాలజీ ప్రొఫెసర్ మహానంద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎంబీయూ లైబ్రరీలో విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవడానికి అవసరమైన విజ్ఞానం ఉందన్నారు. ఎంబీయూ రీసెర్చ్, ఇన్నోవేషన్ డీన్ శ్రీనివాసులు మాట్లాడుతూ వర్సిటీ స్థాపించిన మూడేళ్లలోనే 500 మందికి పైగా పరిశోధక విద్యార్థులు పేర్లు రిజిస్టరు చేసుకోవడం గొప్ప పరిణామమని వెల్లడించారు. పరిశోధక విద్యార్థులకు అవసరమైన సలహాలు అందించేందుకు పర్యవేక్షకులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రో వోస్ట్ డాక్టర్ నాగరాజ రామారావు, వీసీ కరుణాకరన్, రిజిస్ట్రార్ సారథి పాల్గొన్నారు.

చెంగాళమ్మకు వెండి సామగ్రి సమర్పణ



వెండి వస్తువులు అందిస్తున్న దాతలు

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి పట్టణానికి చెందిన ఇమ్మానేని సత్యనారాయణ,బాబామని, ఇమ్మానేని చంద్రశేఖర్‌రావు,చంద్రమతి దంపతులు 6.4 కిలోల వెండి వస్తువులను సమర్పించారు. బుధవారం ఈ మేరకు ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మికి అందజేశారు. సుమారు రూ.7.50 లక్షల విలువైన రెండు వెండి గంగాళాలు, ఒక వెండి దివిటీ అందించినట్లు దాతలు తెలిపారు.

ఉఛీత ఇసుక!



నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలుతున్న ఇసుక



ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలన్నీ బూటకాలని ప్రజలకు మరోసారి అర్థమైంది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసమే హామీలు గుప్పించినట్లు తేటతెల్లమైంది. అందులో భాగంగానే ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టినట్టు అవగతమైంది. " మీ సమీపంలోని వాగు.. నది.. వంకలోకి వెళ్లండి.. కావాల్సినంత ఇసుకను బండికి ఎత్తుకోండి.. దర్జాగా మీ ఇంటి నిర్మాణ పనులకు వాడుకోండి" అంటూ బాబుగారు సెలవిచ్చేశారు. అయితే వాస్తవంలో పాలసీ ఏమాత్రం అమలు కావడంలేదు. సామాన్యుడికి అష్టకష్టాలు తప్పడం లేదు.ఈ క్రమంలో ఇసుకను కూటమి నేతలు ప్రధాన ఆదాయవనరుగా మార్చేసుకున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వేసి అక్రమంగా తరలించేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో యథేచ్ఛగా సైకత దోపిడీకి పాల్పడుతున్నారు. సర్కారు వైఫల్యాలను గమనిస్తున్న గృహ నిర్మాణదారులు ఉచిత ఇసుక పాలసీపై విమర్శలు గుప్పిస్తున్నారు.

- అమలు కాని ప్రభుత్వ పాలసీ
- కూటమి నేతల కబంధహస్తాల్లో నదులు..వాగులు.. వంకలు
- యథేచ్ఛగా సైకత దోపిడీ
- విచ్చలవిడిగా అక్రమ రవాణా
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సామాన్యుడికి శఠగోపం

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జూలై 8వ తేదీన ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకువచ్చింది. ఫ్రీ ఇసుక అంటూనే ఒక్కో పాయింట్‌లో ఒక్కో రేటు విధించింది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉంటే అందులో మూడు సెగ్మెంట్లలో నాలుగు పాయింట్లు ఏర్పాటు చేసింది. మిగిలిన నాలుగు నియోజకవర్గాలవారు ఇక్కడి నుంచే ఇసుక తెచ్చుకోవాల్సిన పరిస్థితి కల్పించింది. దీంతో కొనుగోలుకు మించి రవాణా ఖర్చే తడిసిమోపెడయ్యే దుస్థితి దాపురించింది. పైగా పాలసీ ప్రారంభించిన రెండు నెలలకే కూటమి నేతలు ఆయా పాయింట్లలో ఇసుక కొరతను సృష్టించారు. క్రమంగా ఉచిత ఇసుక పాయింట్లను అసలుకే మూసేశారు. చివరకు తాము ఏర్పాటు చేసిన అనధికార ఇసుక పాయింట్లకే ప్రజలు రావాల్సిన పరిస్థితి తీసుకువచ్చారు.

ఐదు నెలలుగా నానుస్తూనే..

గత ఏడాది సెప్టెంబర్ రెండో వారం నుంచి జిల్లాలో కొత్తగా మూడు ఇసుక పాయింట్లు అందుబాటులోకి తీసుకుస్తామని అధికారులు ప్రకటించారు. పెళ్లకూరు మండలం పాలచ్చూరు వద్ద రెండు పాయింట్లు, కోట మండలం గూడలి సమీపంలోని స్వర్ణముఖి బ్యారేజ్ వద్ద ఒక పాయింట్‌ను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ మూడు పాయింట్లలో 1.37 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని వివరించారు. అయితే ఐదునెలలుగా అదనపు పాయింట్ల ఏర్పాటును నానుస్తూనే ఉన్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక దొరకక నిర్మాణాలు నిలిచిపోయాయి.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్లు

మండలం	ప్రాంతం	టన్ను ధర (రూ.లో)
వెంకటగిరి	మొగళ్లగుంట	590
సూళ్లూరుపేట	మావిళ్లపాడు	465
పిచ్చాటూరు	అడవికొడియం బేడు	200
నాగలాపురం	సుబ్బానాయుడుకండ్రిగ	200

పర్యవేక్షణ శూన్యం

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇసుకను కూటమి నేతలు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో మైనింగ్ అధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి బాలాజీ నాయక్‌కు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మైనింగ్ విభాగానికి సంబంధించి రెండు జిల్లాలకు ఆయనే అధికారి కావడంతో వారంలో మూడు రోజులు తిరుపతి జిల్లాలోను, మరో మూడు రోజులు నెల్లూరు జిల్లాలో ఉంటున్నారు. దీంతో రెండు జిల్లాలపై ఆయనకు పూర్తి పట్టురావడం లేదని, దీంతో ఇసుక స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతోందని పలువురు స్పష్టం చేస్తున్నారు.

యథేచ్ఛగా తవ్వకాలు



కోట మండలం రుద్రవరం సమీపంలో స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలింపు

జిల్లాలోని చంద్రగిరి నుంచి వాకాడు వరకు స్వర్ణముఖి నదీ తీరం ఉంది. ఈ క్రమంలో అన్ని ప్రాంతాల్లోనూ స్వర్ణముఖిలో కూటమి నేతలు యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ నదిలోని ఇసుకకు చెన్నైలో విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రధానంగా శ్రీకాళహస్తి పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేసి అక్రమంగా చెన్నైకి తరలిస్తున్నారు. పట్టణంలోని దుర్గమ్మ కొండ సమీపంలో నది వద్ద హిందూ శ్మశాన వాటిక ఉంది. ఇసుక కోసం ఈ శ్మశానాన్ని సైతం జేసీబీల సాయంతో తవ్వేస్తున్నారు. అలాగే నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నుంచి ఇసుకను విచ్చలవిడిగా తరలిస్తున్నారు. మరోవైపు కాళంగి నదిలోనూ ఇసుక తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పాపానాయుడుపేట సమీపంలోని పలు గ్రామాల్లోని ఇసుకతో కూటమి నేతలు వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ అక్కడా అని లేకుండా ఎక్కడ దొరికితే అక్కడ తవ్వేసి అమ్మేస్తున్నారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో పోలీసులు వైఫల్యం చెందారు. అక్రమార్కుల నుంచి మామూళ్లు తీసుకుని మిన్నకుండి పోతున్నారు. ముఖ్యంగా పెళ్లకూరు మండల పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలకు ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లను స్థానిక రైతులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించినా స్పందించే నాథుడే కరువయ్యాడు. అక్రమార్కులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పోలీసులకు నెలవారీ మామూళ్లు ముట్టజెపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, పెన్నేపల్లె, దిగువచావలి గ్రామాలను కేంద్రంగా చేసుకుని కొందరు ట్రాక్టర్ యజమానులు, ఇసుక వ్యాపారులు కలిసి స్వర్ణముఖి నదిని యథేచ్ఛగా దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. వీరికి కూటమి నేతలు అండగా నిలుస్తూ, వాటాలు వసూలు చేసుకుంటున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. అక్రమార్కుల కారణంగా నదీ తీరంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో అక్రమ తవ్వకాలు కొనసాగితే చుట్టుపక్కల గ్రామాలకు నీటి ఎద్దడి తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకం, రవాణాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

మా దృష్టికి వస్తే చర్యలు



అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారాన్ని మా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా ఉపేక్షించం. తిరుపతి జిల్లాతోపాటు నెల్లూరు జిల్లా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నా. ఏ జిల్లాలో వర్క్ ఉంటే అక్కడ ఉంటా. ఇసుక పాలసీ ప్రకారం కొత్తగా మూడు ఇసుక పాయింట్లు గుర్తించాం. త్వరలో వాటిని అందుబాటులోకి తీసుకువస్తాం.

– బాలాజీ నాయక్, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి



పెళ్లకూరు మండలంలో స్వర్ణముఖి నుంచి ట్రాక్టర్లలో తరలుతున్న ఇసుక (ఫైల్)



రేణిగుంట మండలం జీపాలెంలో ఇసుక కొరతతో ఆగిన ఇంటి నిర్మాణాలు



నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలుతున్న ఇసుక

రుయాలో దుకాణాల వివాదం



కొత్త షాపు ఏర్పాటుకు పనులు చేపట్టిన దృశ్యం

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలోని దుకాణాల వివాదం ముదురుతోంది. ఇటీవల నిర్వహించిన టెండర్లలో ఒక్కో దుకాణం రూ.లక్షలు పలికాయి. ఆశావహులు పోటీపడి సీల్డ్ కవర్లలో భారీ మొత్తానికి టెండర్ దక్కించుకున్నారు. ఓ దుకాణానికి గతంలో రూ.3వేలు అద్దె ఉండగా ఈ పర్యాయం రూ.1.6లక్షలు పలికింది. ఈ విధంగా ప్రతి షాపునకూ ఊహించని స్థాయిలో అద్దె ధర నమోదైంది. ఈ స్థాయిలో అద్దెలు చెల్లించి రోగులకు నాణ్యమైన తినుబండారాలను సరసమైన ధరలకు ఎలా విక్రయిస్తారంటూ పలువురు విమర్శిస్తున్నారు. పేదల ఆస్పత్రిలో ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తే రోగుల పరిస్థితి ఏంటి అంటూ నిలదీస్తున్నారు. ఈ వ్యవహారంపై పలు ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో రుయా పరిపాలన భవనం వద్ద అవుట్ పోస్టుకు సమీపంలో గిరిజన కార్పొరేషన్ తరఫున దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు కొత్తగా అనుమతి ఇచ్చారు. ఈ షాపునకు అధికారులు నామినేషన్ విధానంలో కేవలం రూ. 22వేలు మాత్రమే అద్దె నిర్ణయించారు. పక్కనే ఉన్న జిరాక్స్, టీ షాపునకు రూ.1.6 రెంట్ చెల్లిస్తున్నారు. తక్కువ అద్దెతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న షాపు వల్ల తాము పూర్తిగా నష్టపోతామని దుకాణదారులు లబోదిబోమంటున్నారు. అధికారుల ఉదాసీనతే తమకు శాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ దుకాణాలు వద్దే మరో షాపునకు అనుమతి ఇవ్వడం అన్యాయమని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ షాపును మరో చోటుకు మార్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభును వివరణ కోరగా కొత్త దుకాణం ఏర్పాటుపై అనేక అభ్యంతరాలు వస్తున్నాయని, వాటిని పరిశీలించి ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైల్వే భూమి... అయితే ఏంటి!

- సీఎం చంద్రబాబు బంధువునంటూ టీడీపీ నేత వీరంగం
- రూ.50 కోట్ల స్థలం స్వాహాకు యత్నం



టీడీపీ నేత ఆక్రమణకు యత్నిస్తున్న భూమి

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : " సీఎం చంద్రబాబు బంధువుని.. స్టేట్ అయినా సెంట్రల్ అయినా మాదే అధికారం.. రైల్వే భూమి అయితే ఏంటి.. అది నాదే" అంటూ ఓ టీడీపీ నేత వీరంగం చేశాడు. అటు రైల్వే అధికారులు.. ఇటు రెవెన్యూ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశాడు. వివరాలు.. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ సమీపంలో సర్వే నంబర్ 609లో 60 ఎకరాల రైల్వే భూమి ఉంది. అందులోని ఐదు ఎకరాల్లో రైల్వే శాఖ తరఫున కల్యాణ మండపం నిర్మించేందుకు కేంద్రప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రైల్వే అధికారులు గురువారం భూమి పూజ చేసేందుకు బుధవారం ఆ స్థలంలో ముళ్ల పొదలు తొలగింపజేశారు. అయితే చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ నేత ఒకరు అక్కడకు చేరుకుని ఆ భూమిలో 5 ఎకరాలు నాది అంటూ రైల్వే అధికారులను అడ్డుకున్నారు. భూమి పూజ పనులను నిలిపివేయించారు. దీంతో రైల్వే అధికారులు వెంటనే రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులకు సైతం విషయం తెలియజేశారు. అయితే సదరు టీడీపీ నేత తాను సీఎం బంధువు అని చెప్పడంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. టీడీపీ నేత తనదంటున్న భూమి విలువ సుమారు రూ.50కోట్లకు పైగా ఉంటుందని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

శ్రీకాళహస్తి : సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తామని, అరగంటలో దర్శనం చేయిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో ఎమ్మెల్యే బొజ్జల సుదీర్‌రెడ్డితో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 22వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన ఘటనలు శ్రీకాళహస్తిలో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. భక్తులందరినీ వీఐపీలుగా భావించి త్వరితగతిన దర్శనం చేయించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన మరో పర్యాయం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, పలువురు మంత్రులు సైతం హాజరవుతారని వెల్లడించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల్లో కూటమి నేతలు ఎవరూ పెత్తనం చేయరని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓ బాపిరెడ్డి, ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేలవాలిన వరి

- అకాల వర్షంతో పంట నష్టం
- ఆందోళనలో రైతాంగం



సూళ్లూరుపేట మండలం మంగళంపాడు వద్ద నేలకొరిగిన వరిపైరు



తడమండలం అండగుండాల వద్ద నీటమునిగిన పంట

ఆరుగాలం కష్టించి పండించి పంట ఎప్పుడు ఇంటికి చేరుతుందా.. శ్రమకు తగ్గ ఫలితం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న అన్నదాతలను అకాల వర్షం నిలువునా ముంచేసింది. ప్రభుత్వం సాయం చేయకపోయినా.. అప్పో సప్పో చేసి సాగు చేపడితే నష్టాల ఊబిలోకి నెట్టేస్తోంది. బ్యాంకు రుణాలు, ఎరువుల దుకాణాల వారికి కట్టాల్సిన నగదు ఎలా చెల్లించాలి దేవుడా అనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు సూళ్లూరపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 2,500 ఎకరాలకు పైగా వరి పంట నేలవాలింది.చేతి కందే దశలో పైరు దెబ్బతినడంతో రైతాంగం తీవ్రంగా ఆందోళన చెందుతోంది.

– సూళ్లూరుపేట

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుపతి క్రైం : తిరుపతి నగరంలోని ప్రైవేట్ లాడ్జిలో ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గణేష్ లాడ్జిలో మంగళవారం తమిళనాడు, విరుద్ నగర్ జిల్లాకు చెందిన రాధాకృష్ణ కుమారుడు జైకన్నన్(45) శ్రీవారి దర్శనార్థ వచ్చినట్లు చెప్పి రూమ్ తీసుకున్నాడు. అయితే ఎంతసేపటికి బుధవారం తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన రూమ్‌బాయ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. తలుపులు పగలగొట్టి చూడగా బెడ్‌పై జైకన్నన్ మృతదేహం కనిపించింది. సమీపంలో మద్యం సేవించినట్లు ఆనవాళ్లు లభించాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి చిరునామా సేకరించారు.

టీటీడీకి విరాళంగా 'కియోస్క్'

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయానికి బుధవారం సాయంత్రం కియోస్క్ యంత్రాన్ని ఎస్‌బీఐ వితరణగా అందించింది. దీని ద్వారా క్యూ ఆర్ కోడ్‌తో యూపీఐ మోడ్‌లో రూ.లక్ష వరకు భక్తులు విరాళం అందించవచ్చు. ఇప్పటికే ఎస్‌బీఐ ఐదు కియోస్క్ యంత్రాలను టీటీడీకి సమర్పించింది. ఈ మేరకు యంత్రాన్ని ఎస్‌బీఐ డీజీఎం లేఖా మీనన్, ఆర్‌ఎం వెంకటేశ్వరరావు ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి ప్రారంభించారు.

ఫిబ్రవరి 21 నుంచి ముక్కంటి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలు మొదలై స్వామి, అమ్మవార్ల వసంతోత్సవంలో ముగుస్తాయని వెల్లడించారు. ఈ క్రమంలో ఆదిదంపతులు నిత్యం వివిధ వాహనాల్లో ఊరేగనున్నట్లు వివరించారు.


అంతిమయాత్రలో పాల్గొన్న జనం(ఇన్‌సెట్)కార్తీక్ భౌతిక కాయం

వీరుడా.. నీ త్యాగం చిరస్మరణీయం

దేశ భద్రతలో కీలకపాత్ర పోషించావు.. అరాచక శక్తుల నుంచి కంటికి రెప్పలా దేశ ప్రజలను కాపాడావు.. భరతమాత సేవకు కంకణబద్ధుడివై కఠోర శిక్షణ పొందావు.. ఉగ్రమూకల ఆట కట్టించడంలో అలుపెరగని పోరు సాగించావు.. ఈ పోరులో అశువులు బాసిన ఓ వీరుడా.. నీ త్యాగం చిరస్మరణీయం.. అజరామరం.. సైనికుడా అమరహే.. అంటూ ఎగువరాగిమానుపెంట వాసులు జవాన్ కార్తీక్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. అశ్రునయనాలతో నివాళులర్పించారు.


కార్తీక్ ఫొటోతో భౌతిక కాయం ముందు వెళుతున్న తల్లిదండ్రులు

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు
- అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళి
- ఆదుకుంటామన్న కలెక్టర్, ఎమ్మెల్యే
- వీరజవాన్ కార్తీక్ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు, యువకులు

బంగారుపాళెం: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రమూకల ఎదురు కాల్పుల్లో గాయపడి వీరమరణం చెందిన జవాన్ పంగల కార్తీక్ అంతిమ సంస్కారాలను బుధవారం అధికార లాంఛనాలతో ఎగువరాగిమానుపెంట గ్రామంలో నిర్వహించారు. బెంగళూరు నుంచి కార్తీక్ భౌతిక కాయాన్ని మిలటరీ అధికారులు బంగారుపాళెం మండలం ఎగువరాగిమానుపెంట గ్రామానికి తీసుకువచ్చారు. ఉదయం 5.30 గంటలకు బంగారుపాళేనికి చేరుకుంది. పాలేరు అండర్ బ్రిడ్జి వద్దకు కార్తీక్ బంధువులు, స్నేహితు లు, గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కార్తీక్ పార్థివదేహాన్ని తీసుకు వచ్చిన వాహనాన్ని చూడగానే వీరజవాన్ కార్తీక్ అమరహే, భారతమాతకు జై అంటూ రహదారి పొడవునా నినాదాలు చేసుకుంటూ స్వగృహం వరకు తీసుకువెళ్లారు. కార్తీక్ భౌతికకాయాన్ని చూసిన తల్లిదండ్రులు సెల్వి, వర దరాజులు, కుటుంబ సభ్యులు బోరున విలపించా రు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వీరజవాన్ కార్తీక్ పార్థివదేహాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువకులు సందర్శించి నివాళులు అర్పించారు.

కార్తీక్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ఉగ్రవాదుల పోరులో అసువులు బాసిన వీరజవాన్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ప్రభుత్వ పరంగా అండగా నిలిచి అందాల్సిన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఓ కార్యాలయం ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్తీక్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. కార్తీక్ చదివిన పాఠశాలలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 5 ఎకరాల పొలం కూడా మంజూరు చేస్తామన్నారు. కార్తీక్ కుటుంబం ఉంటున్న కాలనీకి వీరజవాన్ పేరు పెడతామన్నారు. వీరజవాన్ కార్తీక్ దేశం కోసం చేసిన త్యాగం యువతకు ఆదర్శమన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళి

ఎగువరాగిమానుపెంట గ్రామంలో వీరజవాన్ కార్తీక్ పార్థివదేహాన్ని బుధవారం పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఏఎస్పీ హర్షవర్ధన్, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, పలమనేరు ఆర్డీఓ భవానీ, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, స్థానిక సర్పంచ్ శ్రీహరి, పలువురు మాజీ సైనికులు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి నివాళులర్పించారు.

అధికారలాంఛనాలతో అంతిమ సంస్కారాలు

ప్రభుత్వ ఆధికార లాంచనాలతో వీరజవాన్ కార్తీక్ అంతిమ సంస్కారాలు జరిగాయి. కార్తీక్ భౌతిక కాయాన్ని మిలటరీ అధికారులు వాహనంలో వ్యవసాయ క్షేత్రానికి తీసుకు వెళ్లారు. కార్తీక్ చివరి చూపు కోసం అంతిమ యాత్రలో పెద్దసంఖ్యలో ప్రజలు, యువకులు పాల్గొన్నారు. వీరజవాన్ కార్తీక్ అమరహే అంటూ యాత్రగా తరలివచ్చారు. 48 గుర్కా రైఫిల్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్ సింగ్ గిల్ నేతృత్వంలో శ్రీనగర్‌కు చెందిన సుబేదార్లు మహేష్, భరత్, పటేల్‌తోపాటు సైనికులు కార్తీక్ వీరమరణానికి గుర్తుగా జవాన్లు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్తీక్ అంత్యక్రియలను పూర్తి చేశారు. అంతిమ సంస్కారాలు ముగిసేంత వరకు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు అక్కడే ఉన్నారు.


గాలిలో కాల్పులు జరుపుతున్న జవాన్లు


పార్థివదేహం వద్ద కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

పాఠశాల విద్య బలోపేతానికే శిక్షణ


మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్

రామచంద్రాపురం: పాఠశాల విద్య బలోపేతానికే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని మెడ్జీ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ తరగతులను ఆకస్మిక తనిఖీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని 301 మంది ఉపాధ్యాయులకు 6 రోజుల పాటు భాషాభివృద్ధిపై రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంఓ శివశంకరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎంఓ మధు, ఏంఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

అద్దె ప్రాతిపదికన గోడౌన్ కావాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాఠ్యపుస్తకాల నిల్వ చేసుకునేందుకు సుమారు 8 వేల నుంచి 10వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల గోడౌన్ అవసరమవుతుందని డీఈఓ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్బన్ పరిధిలో చదరపు అడుగుకు రూ.10, రూరల్ పరిధిలో చదరపు అడుగుకు రూ.5చొప్పున అద్దె చెల్లించనున్నట్లు వెల్లడించారు. తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లోని గోడౌన్ ఇవ్వదలచిన భవన యజమానులు ఈ నెల 30వ తేదీలోపు తిరుచానూరు రోడ్డు, యోగిమల్లవరంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయశాలలో మేనేజర్‌ను కానీ, 98855 06094 నంబరులో సంప్రదించాలని సూచించారు.



గంగ కాలువ పునరుద్ధరణకు చర్యలు


పూడ్చివేసిన కాలువను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వై కాలనీ సమీపంలో పూడ్చివేతకు గురైన తెలుగుగంగ కాలువ పునరుద్ధరణకు చర్యలు చేపడతామని తెలుగు గంగ డీఈ శ్రీహరి తెలిపారు. అపోలో టైర్స్ పరిశ్రమకు వెళ్లే మార్గంలో మద్యం దుకాణదారుడు ఏకంగా తెలుగు గంగ కాలువను పూడ్చివేసిన ఘటనపై 'బరితెగింపు' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ శివకుమార్, సర్వేయర్ వెంకటరమణతో కలిసి కాలువను పరిశీలించారు. కాలువను పూడ్చివేసినా, ఆక్రమణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యాసంస్థలోనే పరీక్షలకు వినతి


వీసీకి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ డీడీఈ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వతేదీ నుంచి చేపట్టనున్న యూజీ, పీజీ దూర విద్యా విభాగం పరీక్షలను ప్రభుత్వ విద్యాసంస్థలలోనే నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ వర్సిటీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ కోరారు. బుధవారం ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సంస్థలలో పరీక్షలు నిర్వహించేందుకు యత్నిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముని, సాయి, మధు, పవన్, విష్ణు, మోహన్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పునరుద్ధరణకు విజ్ఞప్తి


ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ప్రతిష్టాత్మకమైన జాతీయ ప్రతిభా అన్వేషణ పరీక్ష (ఎన్‌టీఎస్‌ఈ) స్కాలర్‌షిప్‌ను పునరుద్ధరించాలని ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో ఎన్‌టీఎస్‌ఈ స్కాలర్‌షిప్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రేరేపించిందని పేర్కొన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ను నిలిపివేయడం వల్ల ఇప్పటికే అనేక మంది విద్యార్థులు తమ చదువును కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అర్హతలకు గౌరవం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని సూచించారు.

ఇంటి స్థలాల కోసం ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు గ్రామస్తులు ఇంటి స్థలాల కోసం ఆందోళనకు దిగారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని అడ్డుకున్నారు. కనమనంబేడు రెవెన్యూలోని సర్వే నంబరు 252, 253లో ఉన్న ప్రభుత్వ భూమిలో పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. స్థానికేతరుడైన డాక్టరు బత్తెయ్యనాయుడు అక్రమంగా ఎకరా 75 సెంట్లు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుని ప్రభుత్వ భూమిని అప్పగించేస్తున్నారని మండిపడ్డారు. బత్తెయ్యనాయుడు కబ్జాలోని భూమిలో ఫెన్సింగ్‌ను తొలగించాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఇంటి స్థలాలు ఇస్తామని, 252, 253 సర్వే నంబరులోని భూమి కోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులు వచ్చే వరకు వేచి ఉండాలని కోరారు. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నిరాజ్, కత్తి ధర్మయ్య, పాల్గొన్నారు. ఈ క్రమంలో బత్తెయ్యనాయుడు తన స్వాధీనంలోని భూమికి వేసిన ఫెన్సింగ్‌ను గ్రామస్తులు ధ్వంసం చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ఫెన్సింగ్‌ను ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

LEASE / RENT
■ 40,000 Sft & 15000 Sft రెండు గోడౌన్లు తూకివాకం, రేణిగుంట IDA నందు అద్దెకు కలదు. సంప్రదించండి సెల్: 9849151400.

PLOTS FOR SALE
■ తిరుపతి Urban లో మీ సొంత ఇంటి కల నెరవేరే Open Plot(Site)కోసం చూస్తున్నారా అయితే మీ కోసం ఈ అవకాశం. తిరుపతి అన్నమయ్య సర్కిల్ నుండి నేరుగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఆకార్ కార్పొరేట్ స్కూల్, CPR విల్లాస్, Veritas సైనిక్ స్కూల్ దాటగానే C.రామాపురం వద్ద ఇల్లు, Villa, Appartment వెంటనే కట్టుకునే మా Phase-4 Tuda అప్రూవ్డ్ లేఔట్ నందు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్రదించండి: 95055 02346.

RENT
■ Rental for Commercial 2844 Sft 1st Floor, above Union Bank of India, 1-5-513, Balaji Colony, Tirupati, 97040 50222, 9703936169.

TOLET
■ తిరుపతి, అమరావతి నగర్, M.R.పల్లి సర్కిల్ దగ్గర గ్రౌండ్ ఫ్లోర్, నార్త్ ఈస్ట్ ఫేస్ 2 BHK హౌస్ (House) వుడ్ వర్క్‌తో కలిపి బాడుగకు (Rent is Negotiable)కలదు.24hrsWater. 9849321716.

Wanted

■ AN ISO 90001-2000 Company,PCRWare Housing Ltd," Poineers in Logistics". Candidates Can Apply,Senior Accountant-Having Knowledge in Accountancy with Exp. of 5yrs in New Tally Version, Accounts Manager-Min.2yrsExp.with Tally NewVersion. (B.Com /M.Com). Manager Front Office (F) - Having Min.Exp by Maintenance of Office works & required communication skills.The Manager (commercial)356,2ndFloor, Gandhi Road, Tirupathi.0877-22227579.Email:perwhltd @gmail.com, commercial@drpcrayulu.com

■ తిరుపతిలోని ప్రముఖ Restaurant నందు పనిచేయుటకు స్టీవార్డ్స్, కెప్టెన్, క్యాషియర్, తందూరి, చైనీస్ చెఫ్స్ & హోటల్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 87927 66666.

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12గం.రూం+భోజనం వసతి కలదు.&హౌస్‌కీపింగ్ (M/F)8గం.డ్యూటీ.8074434160, 9959994572.

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కు Office Asst., Workers, Tele Caller, PRO, Marketing Staff కావలెను.అర్హత:10th ఆపైన, ఆకర్షణీయమైన జీతం. 6309753339, 9550270326.

■ SR Defence Academy, తిరుపతి, చిత్తూరు నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన Incharges, JL's, PET's & PRO'sకావలెను.ఆకర్షణీయమైన జీతం. Q:డిగ్రీ. ✆ 9000852892, 7893318282.

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతిరోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

■ BEST MONEY GOLD కంపెనీ నాయుడుపేటలో పనిచేయుటకు ఇంటర్ /డిగ్రీ కలిగిన అభ్యర్థులు కావలెను. సెల్ : 91500 11538 .

■ Josh Properties Required Civil Engineer, Receptionist, Tele callers, Marketing Managers, Salary+Incentives,Time:10.00 A.M to 07.00 P.M, Josh Properties, 20-5-5/E backside, K.B.R.Hotel, Opp. Alipiri Police Station, Tirupati,✆8790062445, 6302211738.

■ తిరుపతిలో ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (జీ.11,000+ రూం+భోజనం), సెక్యూరిటీ ఆఫీసర్స్ (జీ.12,500 + రూం+భోజనం) కావలెను. ✆ 8977752022.

■ ప్రభుత్వ సంస్థలలో Out Sourcing పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్లు, ఒకేషనల్ టీచర్లు, క్లర్క్స్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్స్, రికార్డ్ అసిస్టెంట్స్,సూపర్‌వైజర్స్ కావలెను 9603255559.

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డ్స్ చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. సంప్ర : 72074 45286

■ మా కంపెనీ ఓల్డ్ రికార్డ్స్ మరియు టెలికాలర్స్ డేటా ఆపరేటర్ చేయుటకు M/F కావలెను వీక్లీ 6000 జీతం సంప 7993106714

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి జాగ్రత్తగా వ్యవహరించాల్సిందిగా మా పాఠకులకు కోరిక. ప్రకటనదారుల వస్తువులు లేదా సేవలకు ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాబు బొమ్మతో ఇసుక ట్రాక్టర్లు


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్‌పై సీఎం చంద్రబాబు చిత్రం

చిల్లకూరు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను చిట్టమూరు పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అయితే వాటిపై సీఎం చంద్రబాబు బొమ్మ ఉండడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. చిట్టమూరు మండలం మెట్టు సమీపంలోని అనధికార రీచ్‌ల నుంచి టీడీపీ నేతలు ఇష్టానుసారం ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో శ్రీసిటీకి తరలించేస్తున్నారు. అక్కడ నిర్మిస్తున్న ఫ్యాక్టరీలకు అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్టర్లపై సీఎం చంద్రబాబు ఫొటోను వేసుకుని యథేచ్ఛగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో మెట్టు గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎట్టకేలకు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చిన బలరామయ్య మాట్లాడుతూ సీజ్ చేసిన ట్రాక్టర్లను కోర్టుకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

'వళ్లువన్' ప్రాధాన్యతకు వినతి


ఏకసభ్య కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతున్న నేతలు

తిరుపతి కల్చరల్ : వళ్లువన్ కులానికి ప్రాధాన్యత కల్పించాలని వళ్లువన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం చిత్తూరులో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల్లోని వళ్లువన్‌లకు తమిళనాడులో ఎస్సీలుగా గుర్తింపు ఇచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం నేతలు మోహన్, పన్నీర్ సెల్వం, సుందర్ రాజన్, మురళీమోహన్ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలో కేరీర్ ఆపర్చునిటీస్ ఫర్ పార్మసీ ప్రొఫెషన్ ఇన్ అబ్రాడ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెక్సాస్ ఏ అండ్ ఎమ్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.సాంబారెడ్డి మాట్లాడుతూ ఔషధ పట్టభద్రులు తమ అర్హత, నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమ ట్రెండ్స్‌తో అప్‌డేట్ కావాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జోత్స్నరాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

వివాదాస్పద పంట కాలువ సర్వే


కాలువను సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం, మంగళం సమీపంలో వివాదాస్పదంగా మారిన పంట కాలువ ఆక్రమణ అంశంపై స్పందించిన రెవెన్యూ యంత్రాంగం బుధవారం సర్వే ప్రారంభించింది. మిట్ట గాంధీపురం సమీపంలోని అన్నచెరువు నుంచి చెన్నాయగుంట పరిధిలోని మంచినీళ్లగుంటను కలిపే పంట కాలువ కబ్జాకు గురైందని కలెక్టర్‌కు స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కదిలిన రెవెన్యూ యంత్రాంగం మంగళం సర్వేనెంబర్ 78 పరిధిలోని కాలువ సర్వే చేపట్టారు. ఈ మేరకు వివరాలను కలెక్టర్‌కు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

సమన్వయంతో రిపబ్లిక్ డే వేడుకలు

తిరుపతి అర్బన్ : రిపబ్లిక్ డే వేడుకలను ఈ నెల 26వ తేదీన అన్నిశాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌కు కలెక్టర్ వర్చువల్‌గా హాజరయ్యారు. గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు, ఇతర అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఆర్‌డీఓ పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్ బందోబస్తు, జెండా వందనం, ఓపెన్ టాప్ జీపు, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, శానిటేషన్, లైటింగ్ తదితరాలను కార్పొరేషన్, తుడా సమన్వయంతో చేపట్టాలని కోరారు. సీటింగ్, ప్రింటింగ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ ఇన్విటేషన్ ఏర్పాట్లను అర్బన్ తహసీల్దార్ చేపట్టాలని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు, వివిధ శాఖల ప్రగతి నివేదికల మేరకు స్పీచ్ నోట్స్ తయారు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ, ప్రథమ చికిత్స కేంద్రం వంటి ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల స్టాల్స్ 11తో పాటు 12 శకటాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.


గుడిమల్లం ఆలయంలో కలెక్టర్ వెంకటేశ్వర్

పరశురామేశ్వరుని సేవలో కలెక్టర్

రేణిగుంట : ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి సేవించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యాత్రికుల సంఖ్య పెరిగేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, ఆ మేరకు ప్రణాళికలు రూపొందించాలని ఈఓ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులు నాయుడు, పేరం నాగరాజునాయుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పాల్గొన్నారు.

26న స్విమ్స్‌లో 'స్కానింగ్'కు సెలవు

తిరుపతి తుడా : తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఈ నెల 26వ తేదీన రిపబ్లిక్ డే సందర్భంగా సెలవు ప్రకటించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గర్భిణులకు నిర్వహించే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు కూడా ఉండవని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ వ్యాయామ విద్యావిభాగంలో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సారాసరోజిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉద్యోగం పేరిట మోసంపై కేసు

తిరుపతి క్రైం : తిరుపతికి చెందిన ఓ యువతిని ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని యాదవ్ కాలనీకి చెందిన పి. హేమలత ఎంసీఏ చదివింది. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి నిలిచిపోయింది. అయితే మళ్లీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణ, వైజాగ్‌కు చెందిన వినీత్‌సాహి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నరేష్ కుమార్‌ను కలిసింది. 2022 నుంచి ఒకరి తర్వాత ఒకరిని నమ్మి డబ్బులు సుమారు రూ.11 లక్షల వరకు సమర్పించుకుంది. ముగ్గురూ మోసం చేయడంతో చివరకు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.